క్లుప్తంగా

అనగానికి మంత్రివర్గంలో చోటు కల్పించడంపై హర్షం



రేపల్లె రూరల్: రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లభించటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్యప్రసాద్ వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రివర్గంలో అడుగు పెడుతుండటంతో బుధవారం పట్టణంలో పార్టీ నాయకులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పట్టణ ప్రధాన వీధుల్లో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీతారావమ్మ మరణం తీరని లోటు

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అశోక్‌బాబు



వలివేరు(వేమూరు): దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు స్థల దాత తమ్మా సీతారావమ్మని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలం వలివేరు గ్రామంలో తమ్మా సీతారావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మా సీతారావమ్మ కుటుంబం వైఎస్సార్ సీపీకి ఎన్నో సేవలు అందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాదె శివరామ కృష్ణా రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అమర్తలూరు ప్రవీణ్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతికి సంతాపం

రేపల్లెరూరల్: మండలంలోని బేతపూడి అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న జే.దేవమణి (59) అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని బుధవారం స్వగ్రామమైన బేతపూడికి తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, పలు కార్మిక సంఘాల నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జీ.బాలాజీ, పీ.నాగాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బరాయణం మాట్లాడారు. ఈ వ్యాధి దోమ కాటు వల్ల వ్యాపిస్తుందని తెలిపారు. నివారణకు వారంలో ఒకటి లేదా రెండు సార్లు గాబుల్లోని నీటి నిల్వలను తొలగించి శుభ్రం చేసుకోవాలన్నారు. దీనివల్ల దోమ సంతతి వృద్ధి చెందదని చెప్పారు. దోమ తెరలు వాడటం ద్వారా కొంతవరకు దోమకాటు నుంచి తప్పించుకోవచ్చన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు పి. ఎస్తేరురాణి, శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు అభినందనీయం

లక్ష్మీపురం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటిగా భావించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల్లో తొలి 100లో 26 తెలుగు రాష్ట్రాలకే రావడం మనకందరికీ గర్వకారణమని తెలిపారు. కౌన్సెలింగ్‌కి అర్హత పొందిన మొత్తం 11,180 మందిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఏడు వేల నుంచి ఎనిమిది వేల వరకు ఉంటారంటే తెలుగు విద్యార్థుల ప్రభావం జాతీయ స్థాయిలో ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు వారు తమ పిల్లల్ని తెలుగు రాష్ట్రాల విద్యాసంస్థల్లో చేర్చాలని భావించడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు.

శివాలయం పాలకవర్గ సభ్యుల రాజీనామా

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ముగ్గురు తమ పదవులకు బుధవారం రాజీనామా చేశారు. ప్రస్తుతం సభ్యులుగా కొనసాగుతున్న గజ్జల సుబ్బాయమ్మ, గుమ్మళ్ళ వెంకట్రావు, కారంకి శివనాగేశ్వరమ్మలు రాజీనామా చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం

చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసరావు



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సభ్యులు, బాలలు

రేపల్లె రూరల్: నేటి బాలలే రేపటి పౌరులని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేపల్లె మండలంలోని పెనుమూడి, చోడాయపాలెం, పిరాట్లంక, కారుమూరు, తుమ్మల, పోటుమెరక, నల్లూరుపాలెం, విశ్వేశ్వరం గ్రామాలలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. విద్యతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందన్నారు. చదువు పట్ల నిర్లక్ష్యం వహించే చిన్నారులను ప్రతి ఒక్కరూ చైతన్య పరిచి బడిబాట పట్టేలా కృషి చేయాలన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న చిన్నారులను పనులకు పంపటం చట్టరిత్యా నేరమన్నారు. బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా బడికి పంపేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రత్న ఏంజెల్, ఝాన్సీరాణి, ఆయా గ్రామాల మహిళా పోలీసులు, ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

బాల కార్మికులను బడులకు పంపుదాం

ఇంటూరు(వేమూరు): దుకాణా దారులు బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీనియర్ న్యాయవాది గుమ్మడి రవిరాజా పేర్కొన్నారు. అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం తల్లిదండ్రులు, యజమానులు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కోర్టు పీఎల్‌వీ బొర్రు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం బాల కార్మికులకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం వల్ల మానసికంగా, శారీరకంగా, చదువు పరంగా అభివృద్ధి ఆగి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో దుకాణ యజమానులు పాల్గొన్నారు.

వేమూరు: బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం చట్ట రీత్యా నేరమని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ మేనేజరు ఎస్ శ్రీనివాసరావు అన్నారు. వేమూరు మండలంలోని కోడిపర్రు, చావలి, పెరవలిపాలెం, బలిజేపల్లి, వేమూరు, వరాహపురం, జంపని, పోతుమర్రు గ్రామాలలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాల బాలల రక్షణ కమిటీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని బాలలను చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు. కార్యక్రమంలో కీర్తన, లక్ష్మీ పార్వతి, సీఎల్‌సీ వలంటీర్లు, బాలలు పాల్గొన్నారు.



ఇంటూరులో వ్యాపారస్తులతో న్యాయవాదులు



వేమూరులో చిన్నారుల ర్యాలీ

మోగనున్న బడి గంట

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- ప్రభుత్వ బడులకు ఇప్పటికే చేరిన పుస్తకాలు
- విద్యార్థులకు వారంలో పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు తరలిస్తున్న సిబ్బందితో ఎంఈవో శ్రీనివాసరెడ్డి

పొన్నూరు: వేసవి సెలవులు ముగిశాయి. ఈ నేపథ్యంలో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల భవనాలను ఇప్పటికే శుభ్రం చేశారు. ప్రాంగణాల్లోని ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఈ విద్యాసంవత్సరం గురించి సమీక్షించారు. విద్యాకానుక పేరును స్టూడెంట్ కిట్‌గా నామకరణం చేశారు. ప్రతి విద్యార్థికి స్కూల్ బ్యాగ్, బెల్ట్, బూట్లు, యూనిఫాం 3 జతలు, టెక్స్ బుక్స్‌తో పాటు నోట్ బుక్స్ అందించేలా చర్యలు చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకంలో పోషక విలువలతో నిండిన మెనూ అందించేలా చర్యలు చేపట్టారు. నాడు – నేడు పనులు త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు ఆయా వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. విద్యాలయాల ప్రాంగణాలు శుభ్రంగా ఉంచాలని, నీటి శుద్ధి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

పుస్తకాలు సిద్ధం

పొన్నూరు పట్టణం, మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో 5,557 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో బాలురు 2,631, బాలికలు 2,926 మంది. వారికి పూర్తిస్థాయిలో పుస్తకాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నాయని, గురువారం నుంచి పంపిణీ చేస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం నిడుబ్రోలు జెడ్పీ పాఠశాల నుంచి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు, ఇతర సామగ్రి తరలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రధానోపాధ్యాయులకు నేరుగా పుస్తకాలు పంపిస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం నుంచి వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం ఇతర వస్తువులు పూర్తిస్థాయిలో ప్రతి విద్యార్థికి అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఆర్. సుజిత్ కుమార్, డి. దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలగా వెంకటప్పయ్య సేవలు చిరస్మరణీయం



డాక్టర్ వెంకటప్పయ్య చిత్రపటం వద్ద నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య జయంతిని బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఆలపాటి రవీంద్ర కళాపీఠం శాశ్వత సభ్యులు పావులూరి శ్రీనివాసరావు గ్రంథాలయ రంగానికి డాక్టర్ వెలగా వెంకటప్పయ్య చేసిన సేవలను వివరించారు. కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ వెలగా శతాధిక గ్రంథాలను రాయటమే కాకుండా ఎందరో వర్ధమాన రచయితలకు మార్గదర్శకులుగా ఉన్నారని చెప్పారు. గ్రంథాలయాధికారి కె.రమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయ రంగానికి డాక్టర్ వెలగా చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా ఆయన జయంతి, వర్ధంతిని నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందుగా డాక్టర్ వెలగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

దాడిలో వ్యక్తికి గాయం

తాడేపల్లిరూరల్ : బావ కారణంగా బావమరిదిపై దాడి జరగడంతో ఆయన గాయపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉంటున్న యస్‌కే నాగుర్ బాజీ లా చదివి ప్రస్తుతం ఓ ప్రముఖ లాయర్ వద్ద ఉన్నారు. మధ్యాహ్నం సమయంలో ఎస్కే నాగుర్ బాజీకి బావ అయిన ఎస్కే మొహిద్దీన్ పండ్లు కొనడానికి వచ్చారు. అదే సమయంలో వచ్చిన నాగరాజు అనే వ్యక్తితో ఎస్కే మొహిద్దీన్‌కు గొడవ జరిగింది. తర్వాత మొహిద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంతలో నాగుర్ బాజీ రావడంతో కోపంతో నాగరాజు కత్తితో గొంతుపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావం జరగడంతో నాగరాజు పరారయ్యారు. బాధితుడిని 108లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గురవయ్య

నెహ్రూనగర్: బాల కార్మిక వ్యవస్థను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని 21వ డివిజన్ కార్పొరేటర్ కాంట్రకుంట గురవయ్య పేర్కొన్నారు. కొండా వెంకటప్పయ్య కాలనీలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ బాలలంతా బడుల్లో ఉండి, ప్రభుత్వ పథకాల ఆసరాతో అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పేదరికం, కుటుంబంపై ఆర్థిక ఒత్తిళ్లు, వలసలు, లింగ సమానత్వం లేకపోవడం బాల కార్మిక వ్యవస్థ నేటికీ రూపుమాపకపోవడాన్ని కారణాలుగా పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల బాలలపై శారీరక, మానసిక వేధింపులతో పాటు బాలలు అక్రమ రవాణాకు గురవుతున్నారని గణాంకాలు తెలియజేస్తున్నాయని సూచించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ జి. వెంకయ్య మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను అంతం చేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న బాలల్ని పనులలో పెట్టుకోవడం, 14 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలల్ని ప్రమాదకరమైన సంస్థలు, ప్రదేశాల్లో నియమించడాన్ని నిషేధించబడినట్లు తెలిపారు. ఎవరైనా బాలల్ని పనిలో పెట్టుకుంటే జైలుశిక్ష లేదా జరిమానా విధించబడుతుందని పేర్కొన్నారు.

వయోజన టీకాపై అవగాహన

తాడేపల్లిరూరల్ : ఈమని ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామంలో వయోజన టీకాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దుగ్గిరాల మండల టీబీ సూపర్‌వైజర్ డాక్టర్ పి. రవికుమార్ మాట్లాడుతూ పెద్దల టీకా వల్ల క్షయవ్యాధిని నివారించవచ్చునని వివరించారు. 60 ఏళ్ల దాటినవారు, క్షయవ్యాధికి గురై మందులు వాడిన వారు, గత 3 ఏళ్లలో క్షయవ్యాధికి మందులు వాడిన వారి కుటుంబ సభ్యులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగతాగే అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఈ టీకా తీసుకోరాదని తెలిపారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్న్‌షిప్ మైలురాయి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితంలో ఇంటర్న్‌షిప్ మైలురాయి అని ఏఎన్‌యూ వాణిజ్య విభాగ డీన్ ఆచార్య రామినేని శివరామప్రసాద్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇటీవల వివిధ ప్రముఖ సంస్థలు, ఆస్పత్రుల్లో ఇంటర్న్‌షిప్ చేసిన సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ అనుభవాన్ని, వాస్తవ ప్రపంచంలో సమస్యల్ని పరిష్కరించగలిగే నైపుణ్యాల్ని అలవర్చుకునేందుకు ఇది గొప్ప అవకాశమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్టమైన పునాది ఏర్పరుస్తుందని తెలిపారు. ప్రభుత్వ మహిళా కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి. అపర్ణ సీతారామ్ మాట్లాడుతూ ఎంబీఏ అనేది ప్రొఫెషనల్ విద్య అని, విద్యార్థులు తమను తాము దానికి తగ్గట్లుగా మలచుకోవాలని సూచించారు. ఇంటర్న్‌షిప్ ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానాన్ని భవిష్యత్తులో తమ కెరీర్ ఎదుగుదలలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించేందుకు ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింగరాజు వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాక్టికల్ పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాల్ని పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్ అద్భుతమైన అవకాశమని తెలిపారు. వివిధ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసిన తమ విద్యార్థులు కృషి, పట్టుదల, శ్రద్ధాసక్తులతో ఆయా సంస్థల యాజమాన్యాల మన్ననలు చూరగొన్నారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసి, ప్రాక్టికల్ అనుభవాన్ని పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ హెడ్ డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, డాక్టర్ ఎస్. గోపి శ్రీనివాసరావు, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎన్. మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో శివరామప్రసాద్, రామకృష్ణమూర్తి, ఎస్వీ రమణ, అపర్ణా సీతారామ్

'యల్లాప్రగడ' ఆధ్యాత్మిక, సాహితీ సేవ ప్రశంసనీయం

ఎమ్మెల్యే మాధవి



'మన పురాణాలు- కథా సంపుటాలు' ఆవిష్కరణలో ఎమ్మెల్యే మాధవి తదితరులు

నగరంపాలెం: మూడున్నర దశాబ్దాలకు పైగా పత్రికా రంగంతోపాటు సాహిత్యవేత్తగా వేలాది వ్యాసాలు, ఆధ్యాత్మిక సామాజిక చైతన్య గ్రంథాలు రాయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలు, ప్రవాస ఆంధ్రుల అభిమానాన్ని యల్లాప్రగడ మల్లికార్జునరావు చూరగొన్నారని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై గురువారం గ్రంథాలయ జ్యోతి డాక్టర్ వెలగా వెంకటప్పయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు రచించిన 'మన పురాణాలు- కథా సంపుటాలు' ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాధవి పుస్తకాలను ఆవిష్కరించి, తొలి ప్రతుల్ని భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులకు అందజేశారు. డాక్టర్ మల్లికార్జునరావు, ఇందిరాశేషు దంపతుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మల్లికార్జునరావు సాహితీ రంగ లబ్ధ ప్రతిష్టుడని, ఆధ్యాత్మిక, సాహితీ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మల్లాది కైలాస్‌నాథ్ మాట్లాడుతూ బహు గ్రంథకర్తగా, వ్యాసకర్తగా, పత్రికా వ్యాస రచయితగా డాక్టర్ యల్లాప్రగడ ముఖముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, పెద్ది సాంబశివరావు, పావులూరి శ్రీనివాసరావు, దేవస్థానం కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వల పూడికతీతపై దృష్టి పెట్టండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

తెనాలిఅర్బన్: మురుగు, పంట కాల్వల పూడిక తీత పనులను బాధ్యతగా చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని బోసురోడ్డు, అయితానగర్‌లలో జరుగుతున్న మురుగు, పాటి కాల్వ పూడిక తీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎక్కడా మురుగు ఉండకూడదని, నీటి పారుదల సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. ఈ విషయంలో ప్రజలు, రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. వర్షం పడితే ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గాయని శారదా చలపతికి సత్కారం



సత్కార గ్రహీతలు

తెనాలి: పట్టణానికి చెందిన భక్తి సంకీర్తనల గాయనీమణి, ఆధ్యాత్మిక సేవకురాలు శారదా చలపతి చతుర్ అష్టోత్తర శత దేవాయాల్లో (432 ఆలయాలు) సంకీర్తనలను పూర్తి చేశారు. స్థానిక గంగానమ్మపేటలో బుధవారం జరిగిన సంగీత కార్యక్రమంలో శారదా చలపతిని సత్కరించగా, ఆమె తనకు గురువైన ప్రముఖ వయొలిన్, ఓకల్ విద్వాంసుడు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, సౌజన్య దంపతులను సత్కరించారు. గురువు ఆంజనేయశాస్త్రి నుంచి తాను ఎన్నో సలహాలు, సూచనలు తీసుకున్నట్టు శారదా చలపతి చెప్పారు. ఆంజనేయశాస్త్రి మాట్లాడుతూ శారదా చలపతి ఎల్లప్పుడూ దైవ చింతనలో ఉంటూ, సంకీర్తన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. సంగీత కార్యక్రమంలో ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, గాయకులు భాస్కర్, అనూరాధ, సునీత, రమేష్, శ్రీకృష్ణాభిరామ్ పాల్గొన్నారు. వయొలిన్‌పై ఆంజనేయశాస్త్రి, మృదంగంపై నగధర్ వాద్య సహకారం అందించారు.

కూటమి కార్యకర్తల సంబరాలు



అంగలకుదురులో కేక్ కట్ చేస్తున్న గణేష్ యూత్ సభ్యులు

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అంగలకుదురులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, గొల్లపూడి సాయి గిరి, బొద్దులూరి వేణు, కనగాల పిచ్చయ్య, కావూరి చంద్రమోహన్, ముక్కామల సుబ్బయ్య, షేక్ సలామ్, ఖాదర్, ఉన్నవ మురళీ, ఆలపాటి వెంకట్రామయ్య, జాస్తి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. రైల్వే స్టేషన్ వద్ద కూటమి శ్రేణులు బిట్ర కనకదుర్గ, గాలి సుజన్, ఎన్టీఆర్ జగన్, ఎరగుంట్ల మహేష్, దావిద్, అహ్మద్ షరీఫ్, కోటేశ్వరరావు, లింగినేని సాంబశివరావు, చల్ల శ్రీనివాసరావు, బొందలపాటి శ్రీకాంత్, నెలపాటి రాము తదితరులు బాణసంచా కాల్చారు.

చిన్నారుల ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులకు ఉచితంగా ఓపీ సేవలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఉచిత వైద్య శిబిరంలో తెనాలి నుంచే కాక పరిసర గ్రామాల్లోని వారు తమ పిల్లలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాధిక రాజశేఖర్ కుప్పా, డాక్టర్ కేటీఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ అఖిల్ గారపాటి ఉచితంగా ఓపీ సేవలు అందించారు. న్యూ లైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా పర్యవేక్షించారు. హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.